క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



యాజమాన్య పద్ధతులను పరిశీలిస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

చీమకుర్తి: రైతులు సాగు చేసే పద్ధతుల్లో మేలైన యాజమాన్య విధానాలను పాటించినట్లయితే ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి వస్తుందని ఆత్మ పీడీ అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం దేవరపాలెంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా నికర ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. ఆత్మ ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం ద్వారా వరి సాగు చేసే రైతులకు జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు

ఒంగోలు అర్బన్: సినీ హీరో పద్మభూషణ్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో చిరంజీవి యువత అధ్యక్షుడు అడుసుమల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు హాజరై రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. రక్తదాతలను అభినందించారు. రక్తదానం శిబిరం అనంతరం బొమ్మరిల్లు ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. దీనిలో ఈఎన్‌టీ డాక్టర్ నారపుశెట్టి శ్రీనివాసులు, రాంబాబు, ప్రసాద్, మంగళగిరి నరసింహారావు, ప్రసన్న కుమార్‌రాజు, రాజేష్, మెట్టు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో రూ.27 లక్షలు మాయం

ఒంగోలు టౌన్: రూ.5 వేలు కడితే రూ.8 వేలు ఇస్తామంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు వచ్చిన మెసేజ్ చివరికి అతడిని నిండా ముంచేసింది. ఒంగోలు నగరంలోని సుజాతా నగర్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నాడు. ఆన్‌లైన్లో వచ్చిన ఒక ప్రకటన చూసి ఒక గ్రూపులో సభ్యుడిగా చేరాడు. తొలుత రూ.5 వేలు చెల్లించాడు. దానికి వారు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.8 వేలను అతని ఖాతాకు జమ చేశారు. ఇదేదో బాగుంది కదా అని మళ్లీ రూ.5 వేలు చెల్లిస్తే దానికి కూడా రూ.3 వేలు కలిపి రూ.8 వేలు రావడంతో సదరు ఆన్‌లైన్ గ్రూపును గుడ్డిగా నమ్మేశాడు. ఈ నెల 14, 15, 16వ తేదీల్లో ఏకంగా రూ.27 లక్షలు చెల్లించాడు. ఒక్క రూపాయి కూడా రిటర్న్ రాలేదు. సదరు గ్రూపుతో మాట్లాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. మోసపోయినట్లు గ్రహించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మంగళవారం తాలుకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకట సతీష్‌కు ఇండియన్ ప్రైడ్ అవార్డు

వేటపాలెం: వేటపాలెం వాసి చందు వెంకటసతీష్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్- 2023 జాతీయ అవార్డు అందుకున్నారు. ఇండియా ప్రైడ్ అవార్డ్స్ వారు ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఔత్సాహిక యువ వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తూ వారివారి రంగాల్లో విశేష కృషి చేసేవారికి అవార్డు ప్రదాన చేస్తుంటారు. ఈ నెల 19 వ తేదీన బెంగళూరులో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ నటి శ్రేయశరణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సతీష్ పొలిటికల్ ఇంజినీర్ సంస్థ జాతీయస్థాయిలో రాజకీయ నాయకులను డిజిటల్ ప్రపంచంలో ఉన్నతంగా పరిచయం చేస్తూ వారికి వ్యూహ ప్రతివ్యూహాలు అందిస్తూ విశేష ఆదరణ పొందింది. అవార్డు గ్రహీత చందు వెంకట సతీష్ బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట చెందిన వ్యక్తి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ స్పేస్‌లో తన 7 ఏళ్ల శ్రమే తనను ఇలా ఉన్నత స్థితిలో నిలిపిందన్నారు. తనకు ప్రతిష్టాత్మక అవార్డు రావటానికి తోడ్పాటునందించిన తల్లిదండ్రులు, గురువులు, సంస్థ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖులను కలిసిన ఎమ్మెల్యే టీజేఆర్



మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నియోజకవర్గ నాయకులు



సజ్జల రామకృష్ణారెడ్డితో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నియోజకవర్గ నాయకులు

మద్దిపాడు: సంతనూతలపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కావాల్సిన నిధులు అందించాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నియోజకవర్గ నాయకులతో పాటు పలువురు ప్రముఖులను తాడేపల్లిలో మంగళవారం కలిశారు. రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా పని చేసిన వైవీ సుబ్బారెడ్డిని, విజయసాయి రెడ్డి నూతనంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ నియమితులైన సందర్భంగా ఆయనకు బొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తనను ప్రివిలైజ్ కమిటీ మెంబర్, ఎస్సీ వెల్ఫేర్ కమిటీ మెంబర్, బీసీ వెల్ఫేర్ కమిటీ మెంబర్, అస్సైన్డ్ ల్యాండ్ కమిటీ మెంబర్‌గా నియమించినందుకు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞత తెలుపుతూ కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం గతంలో రూపొందించిన అంచనాల ప్రకారం వంద కోట్ల రూపాయలు కేటాయించాల్సిందిగా ధనుంజయరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. సంతనూతలపాడు మండల పార్టీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి, దుంపా యల్లమందారెడ్డి, కిష్టిపాటి శేఖరరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, బొమ్మల రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

● రూ.23.20 లక్షల విత్తనాల పంపిణీ



ప్రకృతి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి, సుభాషిణి

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో ఎస్సీ రైతులు చైతన్య వంతులు కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశామని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ పథకం కింద ప్రకృతి వ్యవసాయం సాగుచేసే రైతులకు మంగళవారం క్రాంతి పథకం సమావేశం హాలులో ఉచిత విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించాడు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎస్సీలు కూడా ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉచిత విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. మండలంలో 232 మంది ఎస్సీలకు రూ.10 వేలు విలువ చేసే విత్తనాల కిట్స్ పంపిణీ చేస్తామన్నారు. 232 మంది రైతులకు రూ.23.20 లక్షల విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అప్పటి రోజుల్లో ప్రతి ఇంటి ముందు పశువులు ఉండి ఎరువులతో సాగుబడి చేసేవారని నేడు పశువుల కనుమరుగయ్యాయని అన్ని యంత్రాలతో చేయటం వలన ఎన్నో వ్యాధులకు గురవుతున్నామన్నారు. ఇతర దేశాల టెక్నాలజీ చూసి రసాయన ఎరువులు వాడటం వలన భూమి నిర్జీవం అయిందన్నారు. ఎకరాకు వేరుశనగ 50 బ్యాగ్‌లు పండాల్సిన పంట 20 బ్యాగ్‌లకు దిగజారిందన్నారు. పురుగు మందులు అవశేషాలు వాడకం వల్ల ప్రకృతి వ్యవసాయంతో తయారు చేసిన కషాయాలతో సాగుబడి చేయాలని సూచించారు. రొయ్యలు కల్చర్ చేసినప్పుడు మేతలో యాంటీబయాటిక్ వాడటం వలన ఇతర దేశానికి ఎగుమతి అయిన రొయ్యలను తిరిగి వెనుకకు పంపించామన్నారు. అప్పటి నుంచి యాంటీబయాటిక్ వేయకుండా సాగుబడి చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా పంటలకు రసాయన ఎరువులు వాడవద్దని హెచ్చరించారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ అళ్ళ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది చిన్న సన్న కారు రైతులు ఉన్నారని ప్రతి ఒక్కరురూ ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయించాలని వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వలన వానపాములు చనిపోయి భూమి సారవంతం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. 232 మందికి విత్తనాల కిట్స్ పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం అడిషినల్ డీపీఎం లక్ష్మయ్య, ఏపీఎం రజీయా సుల్తాన బేగం, మహేష్ రెడ్డి, వికాస్ రెడ్డి, నరసింహులు, రెడ్డప్ప, సీఆర్‌పీలు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



వినియోగదారుల క్లబ్‌ను ఎన్నుకుంటున్న విద్యార్థులు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వినియోగదారుల క్లబ్ కమిటీ నూతన ఎన్నిక జరిగినట్లు పాఠశాల హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం వినియోగదారల క్లబ్ సభ్యులను ఏకగ్రీవింగా ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడుగా టి.తేజస్విని, ఉపాధ్యక్షుడు పి.సాయి జ్ఞాపిక, కార్యదర్శి కె.అభిరామిరెడ్డి, కోశాధికారి కె.వాణి అక్షయతో పాటు 9 మంది విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేశారు. వినియోగదారుల క్లబ్ గైడ్‌గా సీహెచ్ కోటేశ్వరావును నియమించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలు, హక్కులు, విద్యకు సంబంధించిన విషయాలు, కాలుష్యం, ఆరోగ్యం గురించి వివరించారు. ఉపాధ్యాయులు సాయికిషోర్, హరిబాబు, శరత్‌చంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



ట్రాక్టర్లను సీజ్ చేసి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

మద్దిపాడు: మండలంలోని పెద కొత్తపల్లి పంచాయతీ పరిధిలోఉన్న మార్లెళ్ల గుంటపాలెం సమీపంలోని చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. చెరువు మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చెరువు ప్రాంతానికి వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్‌లు చెరువు మట్టిని నింపుకుని ఉండటంతో సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్దిపాడు ఎస్‌ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మైనింగ్ శాఖ వారు సీజ్ చేసి మద్దిపాడు స్టేషన్ కస్టడీకి ఉంచారని ఆశాఖ వారు వారికి అపరాధ రుసుం విధించవచ్చని తెలిపారు.

ఘనంగా వెంకయ్య స్వామి నగరోత్సవం



నగరోత్సవంలో ప్రత్యేక అలంకరణలో వెంకయ్య స్వామి



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: భగవాన్ గొలగమూడి వెంకయ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం, 41వ ఆరాధన మహోత్సవాలు స్థానిక సంతపేటలోని వెంకయ్య స్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు హారతి కార్యక్రమాలను అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వెంకయ్య స్వామి వారి చిత్రపటాన్ని వివిధ రకాల పూలతో అందంగా పుష్పాలంకరణ గావించి రథంలో స్వామి చిత్రపటాన్ని స్థానిక భక్తులు ఆలయ నిర్వాహకులు అర్చక స్వాములు నగర పుర వీధుల ఊరేగించారు. స్థానిక భక్తులు స్వామివారి చిత్రపటానికి మంగళ హారతులు ఇచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. నగర ఊరేగింపులో ప్రత్యేకంగా మైనంపాడు భజన బృందం వారు ఆలపించిన స్వామి గీతాలు భక్తులను ఎంతో అలరింపజేశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేకరించారు. ఈ ఉత్సవాలను ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి వారు తెలిపారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ప్రతి ఓటరు ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయంలో గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. దీనిలో ఆర్‌డీఓ మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. 95 శాతం డోర్ టు డోర్ సర్వే పూర్తి అయిందని తెలిపారు. చనిపోయిన వారి ఓట్లను కొత్త నిబంధనల ప్రకారం పూర్తిగా వివరాలు తీసుకుని తొలగించామన్నారు. దీనిలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఎలక్షన్ విభాగం అధికారులు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, రసూల్ పాల్గొన్నారు.

25న వరలక్ష్మి పూజలు

గిద్దలూరు రూరల్: శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 25వ తేదీన శుక్రవారం రోజు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారి మూల విరాట్ మూర్తి అమ్మవారిని లక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ వాణి

ఒంగోలు రూరల్: కార్పొరేట్ స్థాయి వైద్యం గ్రామీణ ప్రజానీకానికి అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఒంగోలు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. ఒంగోలు రూరల్‌లోని వలేటివారిపాలెంలో సీహెచ్‌వో జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం గతంలో అందని ద్రాక్షగా ఉండేదని కాని నేటి ప్రభుత్వంలో 104 వాహనం ద్వారా ప్రతి గ్రామంలో ఫ్యామిలీ హెల్త్ కేర్ అందిస్తోందన్నారు. అత్యుత్తమ డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఏఎన్ఎమ్స్, పీహెచ్‌సీ సిబ్బంది ద్వారా మంచి వైద్యం అందుతోందన్నారు. ఇందులో భాగంగానే స్కానింగ్, ఎక్స్‌రే, గుండె జబ్బులు, బీపీ, షుగర్‌తో పాటు దీర్ఘకాలిక జబ్బులను గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. ఫలితంగా చికిత్స పొందుతున్న వారు వారి సందేహాలను తీర్చుకునేందుకు సంబంధిత డాక్టర్‌కు ఫోన్ చేసి వారి చికిత్స పొందే అవకాశం ఏర్పడిందన్నారు. అన్ని రోగాలకు కావాల్సిన మందులు కరవది పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని అధునాతన స్థాయిలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని గత నెలలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారని త్వరలో జిల్లా వైద్యాధికారి అనుమతి లభించిన తరువాత ఆపరేషన్‌లు పీహెచ్‌సీలో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 210 మందికి వివిధ రకాలైన పరీక్షలు, మందులు అందజేశారు. సీహెచ్‌వో జయలక్ష్మి, ఏఎన్‌ఎం భారతి, హెచ్‌ఎస్ అజిత, మాధవి, స్టాఫ్ నర్సులు జ్యోతి, భానుమతి, విక్టోరియా, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న సయ్యద్ హనీఫ్

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా ప్రకటించాలని, జిల్లా అభివృద్ధికి వెంటనే 10 వేల కోట్ల రుపాలను కేటాయించాలని వివిధ పార్టీకు చెందిననాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వెనకబాటుతనంపై ప్రజలలో చైతన్యం కలిగించేందుకు మేధావులు, ప్రజా సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం సందరయ్య భవనంలో రౌండల టేబుల్ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ప్రసంగిస్తూ జిల్లా ఏర్పడి 53 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. ప్రకాశం జిల్లా విద్యా, వైద్య రంగాల్లో వెనకబడిపోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీకీ తగిన మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా వున్నప్పటికీ వాటిని గుర్తించడంలో పాలకవర్గాలు విఫయమయ్యాయని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ఎంఎస్ సాయి అన్నారు. కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, కంకణాల ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, ఎస్‌కే మాబు, చుంచు శేషయ్య, టి.గోపాల రెడ్డి, కోడూరి హనుంమంతరావు, చావలి సుధాకర్, కంకణాల రమాదేవి, సుదర్శన్, ఎస్‌కే రసూల్ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పురోగతి పరిశీలనలో మాగుంట



సమావేశంలో పాల్గొన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

ఒంగోలు: బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో హోటల్ మౌర్యలో మంగళవారం జరిగిన నాలుగు జాతీయ ప్రాజెక్టుల నిర్వహణ, పురోగతిపై జరిగిన పరిశీలనకు పార్లమెంటరీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ సంజయ్ జైస్వాల్‌తో పాటు సభ్యులు అయిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. జాతీయ రోడ్డు రవాణా, హైవేస్, జాతీయ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, బీహార్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశ జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు కింద పలు రోడ్డు ప్రాజెక్టు అంచనాల గురించి అధ్యయనం చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ పనితీరు గురించి, కేంద్ర పెట్రోలియం.. సహజవాయువుల మంత్రిత్వ శాఖ, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, బీహార్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై వినియోగదారులకు పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరా ఏర్పాటుపై సిటీ గ్యాస్ పంపిణీ కార్యక్రమం అభివృద్ధి గురించి సమీక్షించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై నమామిగంగే ప్రోగ్రాం కింద మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల అంచనా గురించి సభ్యులు చర్చించారు.

భక్తిశ్రద్ధలతో గానామృతం



లలితా దేవి జయంతి మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామి పేటలో లలిత ఆశ్రమంలో లలితా దేవి 40వ జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారి అభిషేకం, శ్రీ చక్రానికి సహస్రనా మార్చన, మంగళ గౌరి వ్రతం, కుంకుమార్చన, నిర్వహించి తీర్థప్రసాద వితరణ గావించారు. మధ్యాహ్నం 3 గంటలకు గీతాచార్య, గంజి పిచ్చయ్య శేష్టి, కోటిరత్న వారి బృందంచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరిగింది. రాత్రి 7 గంటలకు గాన గంధర్వ ఘోరకవి సంపత్‌కుమార్ వారి బృందంచే శ్రీకృష్ణ లీలా తరంగిణి గానామృతం నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చక స్వాముల చేత తీర్థప్రసాదాలు సేకరించి వారిచే వేద ఆశీర్వచనం తీసుకున్నారు. లలిత ఉపాధ్యాక్షులు రాష్ట్ర సనాతన ధార్మిక సంఘం అధ్యక్షుడు స్వయంపాకుల కోటేశ్వర శర్మ, అగస్త్యరాజు, శివ సుబ్రహ్మణ్యం వారి పరివేక్షణ నిర్వహించారు.

వైభవంగా గంగమ్మతల్లి కొలుపులు, ప్రతిష్ట



మాతుడుపులో భాగంగా పుట్టవద్దకు చేరిన గోరంట్ల వంశస్తులు



నక్కబొక్కలపాడులో గ్రామోత్సవం

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారి దేవర గంగమ్మ తల్లి కొలుపులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలోని శిలలు బొల్లి ఆవులతో చీరాల సముద్రస్నానానికి తరలి వెళ్లారు. మంగళవారం గ్రామోత్సవంతో పుట్ట బంగారం, మాతుడుపు చేపట్టారు. రాత్రికి బొల్లి ఆవులతో గ్రామోత్సవం, బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించనున్నారు. నూతన ఆలయం నిర్మాణం కొలుపుల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న గోరంట్ల కుటుంబ సభ్యులంతా తరలిరావటంతో గ్రామంలో పండగ వాతావరణ నెలకొంది. ప్రతిష్ట తదుపరి బుధవారం రాత్రికి గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు పాల్గొని ఈర్ల గంగమ్మ ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలు



జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న మహిళా రైతు ఈశ్వరి

చీరాల టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ఉత్పత్తులు తయారు చేయడం వలన పోషకాలతో పాటు సాగు ఖర్చులు చాలా తగ్గుతాయని డీపీఎం వాణీశ్వరి, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీలో మహిళా రైతు గవిని ఈశ్వరి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల సాగుభూమిని ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది, పలువురు రైతులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పదధతుల ద్వారా జీవామృతం తయారు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తుండటం వలన సాగు ఖర్చులు తగ్గి పోషకాల ఆహారం లభిస్తుందన్నారు. మహిళలు వ్యవసాయ రగంలో రాణించి ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను గురించి వివరించారు. జీవామృతం తయారీకి వినియోగిస్తున్న ప్రకృతి వ్యవసాయంలో రసాయనాలు లేకుండా తక్కువ ఖర్చులతో తయారు చేసే మిశ్రమాన్ని గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోములు, వెంకటేశ్వర్లు, శిరీష, కవిత, ఈశ్వర లక్ష్మీ, నిర్మల, ఎ.శ్రీనివాసరెడ్డి, స్వరూప, కవిత తదితరులు ఉన్నారు.